రెండు పిల్లుల కొట్లాట

# రాగద్వేషాలు

దండమూడి మహీధర కుమార్

ఉదయం నుంచీ కూడా తన నెత్తిన ఏదో గుమ్మ్యారం పడినట్టుగా వుంది. ఏదనీ చేయ బుద్ధి కావటం లేదు. ఆ సమయానికి తను స్నానం చేసి, తల దువ్వుకొని స్కూలుకెళ్ళాలి కాని తన మనస్సు మనస్సులో లేదు. భావాలు పని చేయటం లేదు. తన దృష్టి కొద్దిదూరంలోనే ఎదురుగా ఉన్న ఆ యింటిమీదే వుంది.

ఇదివరలో ఆ యింటికి తను ఎన్నిసార్లు వెళ్ళ లేదు! మంజూ తనూ కలిసే క్లాసుకు వెళ్లేవారు! ఇద్దరూ ఎన్నెన్నో విషయాలు చెప్పుకునేవారు. కాని ఈరోజో? మంజు అంటే తగని ద్వేషం కలుగుతోంది. ఆపిల్ల మొహంవేపు చూస్తేనే తనకు ఎక్కడలేని మంట రగుల్కొంటోంది. ఇలాంటిది ఆపిల్ల పెళ్ళిరోజు నుంచే ఏర్పడి ఈనాటికి సహించరాని వేదనగా కూడా మారింది.

* * *

సూర్యోదయం అవుతూన్న సమయాన మంజు తన భర్త-మధుతో బండిమీంచి దిగింది. ఎంత బావుంది! లేత సూర్యకిరణాలు నవదంపతుల మీద సన్నగా 'ఫోకస్' అయేటప్పటికి ఏదో నవ్యకాంతి ఆ యిద్దరి మొహాల్లో ప్రభవించి ఒక తెలీని భవ్యతను చేకూర్చుతున్నాయి. అప్పుడు వాళ్ళిద్దర్నీ చాలామంది చూచి సమ్మోహితులయ్యారు. కాని తనకు మాత్రం కటికె చేదు మందు తింటున్నట్టుగా వుంది. అసలు తను ఆ దృశ్యాన్ని చూడలేకపోయింది. ఆ సమయానికి తను తల గిరుక్కున తిప్పేసుకొని లోనికి వెళ్ళిపోయింది.

* * *

ఈరోజు తను స్కూలుకు వెళ్లటం మానుకుంది. గదిలో మంచంమీద పడుకొని ఏవేవో చాలా చాలా ఆలోచించింది. పదిగంటలు కావస్తున్న సమయాన అప్రయత్నంగా లేచి ఎదురుగా వున్న గదిలో మంజు కూచొని వుంది. ఆమెను అభినందించేందుకు చాలామంది వచ్చి వెళ్తున్నారు. మంజు రాణీలా మధ్యలో కూచొని హాయిగా నవ్వుతూ సమాధానం చెబుతోంది. తను చూడలేకపోయింది. కిటికీ తలుపుల్ని విసురుగా మూసేసి గబగబా లోనికి వెళ్ళిపోయింది.

ఉదయం కోపంతో మూసేసిన కిటికీ తలుపుల్ని మధ్యాహ్నం ఎంతో 'క్యూరియస్'గా బార్లాగా తెరిచింది. గదిలో మంజూ — మధూ ఎదురెదురుగా కూచొని నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. మాటిమాటికీ మధు మంజు చేతిని తాకుతున్నాడు. ఆమె ఏవేవో కలల తలపుల దోనెల్లో తేలిపోతోంది.

ఈ దృశ్యం తనకు ఒక తెలీని బాధను కలిగిస్తున్నా లోలోపల ఎందుకో అలాగే ఆ కిటికీ తలుపుల్ని తెరిచివుంచాలనే కోరిక ప్రబలంగా పనిచేస్తోంది. ఆ కారణంచేత తను అలాగే ఆ కిటికీ ముందు సాయంత్రం వరకూ కూచుంది.

* * *

నాలుగున్నరకు లేచి లోపలికెళ్ళి స్నానం చేసింది. గదిలోకి వచ్చి ఒక మంచి చీర కట్టుకొని తల దువ్వుకుంటున్న సమయంలో మధు ఏదో పుస్తకం పుచ్చుకొని షికారుకు గాబోలు-వెళ్లటం చూసి-వెంట్రుకల్ని అలాగే వదులుగా వుంచుకొనే కిటికీ తలుపు తీసింది. ఆ సమయానికే మధు ఇటువేపు చూశాడు. తను అలాగే దువ్వెన చేతిలో పుచ్చుకొని చూట్టం ప్రారంభించింది. మధు మూర్తివత్ బజారు మధ్యలో ఆగిపోయాడు. 'మధూ!' అనాలనిపించింది తనకి కాని అనలేదు. తనను మధు 'తులసీ!' అంటాడనుకుంది. కాని అనలేదు. ఒకసారి దీక్షగా చూచి మధు వెళ్ళిపోవటం తనకెంతో అవమానంగా తోచింది.

ఇంతవరకూ తనకు కోపమల్లా మంజుమీద వేసింది. ఇప్పుడది విడిపోయి మధుమీదికి మరలింది. ఆ కోపానికి సంబంధించిన భావాలు ఇంకో గంట వరకూ పనిచేస్తే తను పిచ్చిదయి

పోవటంలో సందేహం లేదు. అందుకే గబగబా తను అలంకరించుకొని బయటికి వచ్చింది.

*　　　　*　　　　*

తనని చూడగానే మంజు హృదయం విప్పి నవ్వింది. తానుకూడా నవ్వింది. ఒకరు అమృతాన్ని వర్షిస్తుంటే మరొకరు హాలాహలాన్ని. నవ్వుతూ కూచోమని కుర్చీ చూపింది. గదిలో మంజూవినా మరెవరూ లేరు. కిటికీకి సమీపంలో డ్రాయర్ మీద మధు నవ్వుతూన్న ఫోటో ఒకటి ఫోటో స్టాండ్‌లో అమర్చివుంది. మంజు ఆ డ్రాయర్‌కు ఆనుకొని నిల్చున్న విధం అదో రకమైన నాట్యభంగిమలా వుంది.

తను అన్నది: 'మంజూ! ఉదయంనుంచీ ఎంతోమంది వచ్చి నిన్ను అభినందించారు. నేను మాత్రం అభినందించేందుకు రాలేదు. నిన్ను నీపై తిరుగాడుతున్న విపత్తునుంచి తప్పించేందుకు నేను ఉదయంనుంచీ ఆలోచిస్తున్నాను.

'మధుని నేను గత వేసవిలో మొదటిసారి వైజాగ్‌లో చూచాను. ఒక్క నిమిషంలో మనుష్యుల్ని పరిచయం చేసుకుంటాడు. మా అన్నయ్య పరిచయాన్ని పురస్కరించుకొని నాకు పరిచితుడయ్యాడు. కొద్ది రోజులకే మా అన్నయ్య మధు పరిచయానికి మరో రూపం కల్పించాలనుకున్నాడు-పెళ్లి అనే పేరుతో!

'మధు అంత ఉన్నవాడూ కాదు, అంత చదువుకున్నవాడూ కాదు. వాస్తవాన్ని వదిలిపెట్టి ఊహా జగత్తులో విహరించే స్వప్నజీవి! ప్రపంచంలోని ప్రతి వస్తువులోనూ, ప్రతి అణువులోనూ కాంతిని అతికించాలని ఆరాటపడే కాల్పనిక వ్యక్తి. అలాంటప్పుడు అతని వ్యూహాలు ఆకాశ కుసుమాల్లాగా అంతర్హితం కావటంలో ఆశ్చర్యం లేదు. ఈరోజు ఉల్లాసంతో గడిపి రేపీపాటికి నిన్ను వదిలి వెళ్లటానికూడా సంకోచించని మనిషి! నువ్వు మధు మోహంలో పడిపోయావు. నాకివన్నీ తెలియబట్టి అతని మోసంనుంచి తప్పించుకోగలిగాను. ఈవిషయాన్నే నేను నీకు మధు ఎదుటకూడా చెప్పగలను. ఇది నీ జీవితానికి సంబంధించిన సమస్య! అతనిద్వారా నీవు సుఖాన్ని పొందలేవు. ఈ విషయం నీఅంతట నీవే తెలుసుకోగలవు. స్నేహితురాలివి గనుక, నీమేలును కాంక్షించి ఇలా చెప్పక తప్పటంలేదు.'

ఈ మాటలు విని మంజు ఒక్కసారిగా తలొంచుకొని ఏడ్చింది. అబద్ధాన్ని అంత తేలికగా అతికించగలిగినందుకు తాను ఎంతో ఉప్పొంగిపోయింది.

'ఆలోచించుకో' అని తను వెళ్లిపోయింది.

*　　　　*　　　　*

మంజుకు మధు గుర్తుకొచ్చాడు. అతను పలికిన మాటలు స్మృతిపథంలో మెదిలినాయి- 'నీకోరకు నేను, నాకోరకు నీవు. నీవు నేనై నేను నీవై విశాల నీలాకాశతలాన జన్మజన్మాల యాత్రగా పక్షుల్లా తేలిపోదాం.' ఇలాగే వైవాహిక జీవితాన్ని గూర్చి మధు ఎన్నో అన్నాడు. వాటిని విన్నాకనే మంజులో ఎన్నెన్నో కోర్కెలు పూచినాయి.

మంజుకు ఏంచేయాలో తోచలేదు. వెక్కి ఏడ్చింది. ఒకగంట క్రితం నవ్వుల గలగలతో నిండి ఉన్న ఆ గదిలో ఇప్పుడు కన్నీటి వరదలు ప్రవహిస్తున్నాయి.

'మధూ! నన్నెందుకు మోసం చేశావ్? అని డ్రాయర్ మీదవున్న మధుఫోటో చేతుల్లోకి తీసుకుంది. పట్టుదప్పి ఆ ఫోటో క్రిందపడి ముక్కలుముక్కలయింది.

ఇదంతా తను చూస్తూనేవుంది. తనువికటాట్టహాసం చేసింది. పోయిన వస్తువు లభించినంత పనయింది తనకు.

తెల్లారింది. వెంటనే తాను రాత్రి చూసిన కల గుర్తుకొచ్చింది. కలలో మంజు విషం తిని చనిపోతుంది. దాంతో తనకు ఎంతో హాయి అనిపించింది. గబగబా లేచి కిటికీ తలుపులు తెరిచింది మంజూ. మధు నిన్నటి హాసపరిహాసాలతో గడిపినగది శ్మశాన వాటికగా కన్పించింది. బయటికి వచ్చేప్పటికి ఆ ఇంటిముందు పనిమనిషి పని చేస్తోంది. పిలిచి మంజు విషయం ఎంతో ఆదుర్దాగా అడిగింది తను! 'తెల్లవారుఝామున రైలుకు వైజాగ్ వెళ్లిపోయారని' విన్నప్పుడు తన ప్రాణాలు లేచిపోయినంత పనై తనమీద ఒక పిడుగు పడినట్లనిపించింది.

వేటగాడు గురిపెట్టేలోగానే పక్షులు ఎగిరి నిర్మల నీలాకాశంలో కలిసిపోయాయి.